క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిష్టర్స్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ తెలిపారు.

నేటి నుంచి త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు

పంజగుట్ట: వేద వేదాంత సాహిత్య సభ 'విజ్ఞాన సమితి' ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి 18వ తేదీ వరకు ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో 176వ త్యాగబ్రహ్మ ఆరాధనోత్సవాలు, విజ్ఞాన సమితి 46వ వార్షికోత్సవాలు నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు తెలిపారు. 12వ తేదీ ఉదయం కలశ స్థాపన, ఉపనిషత్ పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి హాజరవుతారని తెలిపారు.

శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎ.శాంతి కుమారిని బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా – ఖైరతాబాద్

కాశ్మీర్ పండిత్ ఉద్యోగులకు భద్రత కల్పించండి

లిబర్టీ: కాశ్మీర్ పండిత్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు కేవీఎస్ శర్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాశ్మీర్ లోయలో పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని 240 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లోయతో పాటు జమ్మూ కాశ్మీర్ లోనూ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఆఫీసులోకి చొరబడి మరీ రాహుల్ అనే ఉద్యోగిని ముష్కరమూకలు కాల్చి చంపాయన్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి లోయలో పని చేస్తున్న పండిత్ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని విన్నవించారు.

శ్రీనికేతన్ కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



శ్రీనికేతన్ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని శ్రీనికేతన్ కాలనీలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బుధవారం బంజారాహిల్స్ జలమండలి సెక్షన్ మేనేజర్ శివకుమార్‌తో కలిసి పర్యటించారు. కాలనీ అధ్యక్షురాలు సుమతితో పాటు కమిటీ సభ్యులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సీవరేజి ఓవర్ ఫ్లో సమస్య తీవ్రంగా ఉందని, మ్యాన్‌హోళ్లు వ్యర్థాలతో నిండిపోయాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇలా ఉండగా, దేవరకొండ బస్తీకి చెందిన నౌషీన్ ఫాతిమాకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును ఆమెకు కార్పొరేటర్ అందజేశారు.

'పెట్రో' ధరలకు అనుగుణంగా ఆటో ఛార్జీలు పెంచాలి

లిబర్టీ: పెరిగిన పెట్రోల్, డిజిల్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచాలని డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరల కారణంగా ఆటో డ్రైవర్లపై ఆర్థిక భారం పడుతోందన్నారు. పెరిగిన గ్యాస్, డిజిల్, పెట్రోల్ ధరలకు అనుగుణంగా కనీస చార్జీ రూ.40కి పెంచాలని విజ్ఞప్తి చేశారు. 12 సంవత్సరాల క్రితం ఆటో చార్జీలు పెంచారని, అప్పటి నుంచి మళ్లీ పెంచలేదన్నారు. ప్రస్తుతం రూ. 20 కనీస చార్జీగా అమలులో ఉందన్నారు. 60 రూపాయలు ఉన్న పెట్రోల్ ధర 110కి చేరిందని, 40 రూపాయల డిజిల్ ధర 100కు చేరిందని 30 రూపాయలు ఉన్న గ్యాస్ ధర 68 రూపాయలకు చేరిందన్నారు. ఫలితంగా గ్రేటర్‌లో ఉన్న 2 లక్ష మంది ఆటో డ్రైవర్లపై మోయలేని భారం పడుతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెంటనే స్పందించి ఆటో చార్జీలు పెంచుతూ జీఓ జారీ చేయాలని రుద్రాక్ష మల్లేశ్ విన్నవించారు.

ఎట్టకేలకు రేషన్ బియ్యం పంపిణీ

- పది రోజుల జాప్యానికి తెర
- షాపుల వద్ద క్యూకట్టిన కార్డుదారులు
- ఒక్కొక్కరికి 5 కిలోలు



ఇందిరానగర్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

బంజారాహిల్స్: చౌక దుకాణాల్లో పది రోజుల నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు బుధవారం రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభమైంది. గత పది రోజుల నుంచి కార్డుదారులు బియ్యం కోసం దుకాణాల చుట్టూ తిరుగుతుండగా నేడు, రేపు అంటూ డీలర్లు పంపించడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం చొప్పున ఈ ఏడాది ఆఖరి వరకు ఉచితంగా అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచిత బియ్యం ఆదేశాలు నేడో, రేపో వస్తాయని ఎదురుచూసిన డీలర్లకు నిరాశే మిగిలింది. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించే 5 కిలోల బియ్యం మాత్రమే ఉచితంగా పంపిణీ చేయాలని మంగళవారం రాత్రి డీలర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఉదయం నుంచి ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధిలోని 81 దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభించారు.

- సర్కిల్–7 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ, వెంగల్‌రావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 81 రేషన్ షాపులు ఉండగా వీటి పరిధిలో 83,127 తెల్ల రేషన్ కార్డుల ఉన్నాయి.
- అంత్యోదయ, అన్నయోజన కార్డులు 3368 ఉండగా ఒక అన్నపూర్ణ కార్డు ఉంది. ఈ మొత్తం రేషన్ కార్డుల్లో కలిపి 2,85,267 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఒక్కొక్కరికి అయిదు కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేపట్టారు.
- నిబంధనల ప్రకారం ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ చేపట్టాల్సి ఉంది. ఉచిత బియ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యమే పది రోజులుగా కార్డుదారులకు బియ్యం అందకుండా చేసింది. బియ్యం పంపిణీపై ప్రభుత్వం నుంచి పది రోజుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో డీలర్లు పంపిణీకి ముందుకు రాలేదు. ఇదిలా ఉండగా గత నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అన్ని రేషన్ దుకాణాలకు బియ్యం కోటా సరఫరా చేశారు. షాపుల్లో బియ్యం ఉన్నా పంపిణీ చేయలేని పరిస్థితులు తలెత్తింది.

ఈ పాస్ యంత్రంలో....

- డిసెంబర్ వరకు కార్డుదారులకు పది కిలోల చొప్పున ఉచిత రేషన్ బియ్యం ఇచ్చారు. ఈ–పాస్ యంత్రంలో ఈ మేరకు పది కిలోలు ఒక్కో కార్డుదారుడికి నమోదై ఉంది. అయితే జనవరి నుంచి ఐదు కిలోలే కావడంతో సదరు సాఫ్ట్‌వేర్ నవీకరణ పూర్తి కాలేదు. ఇది గందరగోళానికి దారి తీసింది.
- ఒక వేళ దుకాణాలు తెరిచినా ఎంత పరిమాణంలో ఇవ్వాలనేది స్పష్టత లేకపోవడంతో డీలర్లు మిన్నకుండా పోయారు. దుకాణాల నిల్వలు అలాగే ఉండిపోయాయి.
- బియ్యం కోసం రోజూ కార్డుదారులు షాపుల చుట్టూ తిరిగారు. ఆలస్యం కావడంతో వీటిపైనే ఆధారపడుతున్న బడుగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీలర్లను కదిలించినా ఫలితం లేకుండా పోయింది.
- మొత్తానికి పది రోజుల అనంతరం బియ్యం పంపిణీ చేపట్టడంతో కార్డుదారుల్లో కొంత ఆనందం వ్యక్తమైంది.

'మనబస్తీ-మనబడి' పనులు త్వరగా పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: 'మన బస్తీ–మన బడి' పథకంలో ఖైరతాబాద్ నియోజక వర్గంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే పూర్తి కావడంపై ఎమ్మెల్యే దానం నాగేందర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మన బస్తీ–మన బడి పనుల పురోగతిపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన బుధవారం కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ నియోజక వర్గం పరిధిలో అభివృద్ధి పనుకు ఎంపిక చేసిన పాఠశాలలు, జరుగుతున్న పనుల తీరును ఏకరువు పెట్టారు. సాధ్యమైనంత త్వరగా ఈ పనులను పూర్తి చేయాలని కోరారు. అలాగే ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులకు కేటాయించాల్సిందిగా విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు.

బస్తీవాసులందరికీ పట్టాలు ఇప్పిస్తా



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న దుర్గా భవానీనగర్ బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నం.5 దుర్గా భవానీనగర్ బస్తీలో 90 మంది నిరుపేదలు నివసిస్తున్నారని, వీరందరికీ పట్టాలు మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకుంటామని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సంక్రాంతి తర్వాత సంబంధిత అధికారులను పిలిపించి బస్తీల్లో పర్యటిస్తానని, బస్తీని ఆనుకొని ఉన్న దోబీఘాట్ బస్తీని వేరే చోటకు తరలించేందుకు ఏమైనా అవకాశం ఉందా అనే విషయాన్ని కూడా పరిశీలించి అందరికీ న్యాయం చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఘనంగా కూడారై ఉత్సవాలు

వెంకటేశ్వరకాలనీ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కూడారై ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వెండి గిన్నెల్లో పాయస నివేదన జరిగింది. ఆలయ ఈఓ ఎన్. లావణ్యతో పాటు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ గోదాదేవి అమ్మవారికి పాయసాన్ని నివేదించారు.

వెంకటేశ్వరనగర్‌లో...

బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం గోదాదేవి రంగనాథ స్వామి వార్ల విశేష అలంకరణను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి పాయసం నివేదించారు.



శ్రీనగర్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



రోడ్ నం. 14లోని శ్రీవారి ఆలయంలో కూడారై వేడుకల్లో అమ్మవారి దివ్యదర్శనం

వీవీ హాస్టల్ సేవలు తిరిగి అందేలా కార్యాచరణ

ఖైరతాబాద్: పేద విద్యార్థుల సౌకర్యార్థం నిజాం కాలంలో కాచిగూడలో ఏర్పాటు చేసిన వీవీ హాస్టల్‌ను కొందరు అన్యాక్రాంతం చేసుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని రాష్ట్ర వీరశైవ లింగాయత్ గౌరవ అధ్యక్షుడు పట్లోల సంగేశ్వర్ అన్నారు. ఈ హాస్టల్‌ను తిరిగి పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్యమ కార్యాచరణ చేపడతామని ఆయన అన్నారు. ఖైరతాబాద్‌లోని వైశ్యభవన్‌లో బుధవారం లింగాయత్‌ల సమావేశం నిర్వహించారు. నిజాం కాలంలో ఒకటిన్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన వీవీ హాస్టల్ కొందరి చేతుల్లోకి వెళ్లిందని, దానిని వచ్చే విద్యా సంవత్సరంలోపే పేద విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.



సమావేశంలో పాల్గొన్న వీరశైవ లింగాయత్‌లు

సమావేశంలో తెలంగాణ నాట్య అకాడమీ మాజీ అధ్యక్షుడు బాద్మి శివకుమార్, హన్మంతు, వెట్టి శివకుమార్, ఆర్‌వీఎల్ఎల్‌బీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచప్ప, రాష్ట్ర యువజన అధ్యక్షుడు శివచరణ్ పట్లోల, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు భరత్‌కుమార్, యువత ప్రధాన కార్యదర్శి గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలి: చాడ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చాడ తదితరులు

హిమాయత్‌నగర్: బడుగు బలహీన వర్గాలవారైన వృత్తిదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లని మఖ్దూం భవన్‌లో బుధవారం తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి రూపొందించిన 2023 నూతన సంవత్సర కేలండర్‌ను చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, తెలంగాణ వృత్తి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా రాష్ట్రంలోని రజకులు అనేక అవమానాలను ఎదుర్కొంటున్నారన్నారన్నారు. 50 ఏళ్లు దాటిన రజక వృత్తిదారునికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రజకుల పోరాటాలకు సీపీఐ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు పగిళ్ల జోజి, రాష్ట్ర నాయకులు గొరుకంటి కృష్ణ, చిక్కుళ్ల పద్మ, దండు నిరంజన్, పి. భాగ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై సమావేశం

బంజారాహిల్స్: ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు శిబిరంపై బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్–18 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని కార్పొరేటర్లు, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్, సీఎస్ రెడ్డి

రహమత్‌నగర్: దివంగత వడ్డె ఓబన్న స్వాతంత్య్ర సమరంలో వీరోచితంగా పోరాడి ఎందరో దేశభక్తులకు ఆదర్శంగా నిలిచారని గ్రేటర్ హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కొనియాడారు. వడ్డెర ఐక్య వేదిక, దళిత సేనా ఆధ్వర్యంలో ఎస్పీఆర్ హిల్స్‌లో బుధవారం నిర్వహించిన వడ్డె ఓబన్న జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ, స్వాతంత్ర పోరాటంలో యుద్ధ వీరునిగా వడ్డె ఓబన్న మన్ననలు పొందారని గుర్తుచేశారు. అలాంటి గొప్ప యోధుని విగ్రహాన్ని ఎస్పీఆర్‌హిల్స్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు .అనంతరం కేక్ కట్‌చేసి, దళిత సేనా రుపొందించిన కేలండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య, దళిత సేనా జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు ఘంటా మల్లేశ్, వడ్డెర ఐక్య వేదిక నాయకులు గొలుసుల ఎల్లయ్య, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు మేఘన పద్మ, నాగమణి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి పెరిగిన ఆదరణ



ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

పంజగుట్ట: ఆయుర్వేద వైద్యం ఎంతో ప్రాచీనమైనదని, చాలా దేశాలు భారతీయ ఆయుర్వేద వైద్య విధానాన్ని అవలంభిస్తున్నాయని ఎర్రగడ్డ ఆయుర్వేదిక్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి ఎర్రగడ్డ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘం, జై జవాన్ జై కిసాన్ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో అలర్జీ, అస్తమా, చర్మవ్యాధులు, నేత్ర, దంత తదితర సమస్యలతో బాధపడుతున్న సుమారు 300కి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ .. కరోనా వచ్చినప్పటి నుంచి మన దేశంలో కూడా ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరిగిందని, చాలా మంది ఈ వైద్యం చేయించుకుంటున్నారని అన్నారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రమాబాయి, బస్తీ అధ్యక్షుడు దాసరి విశ్వనాథం, యువజన అవార్డు గ్రహీత భగవాన్‌దాస్, జి.సుధీర్ కుమార్, మహేష్ కుమార్, వెంకటేష్, శ్రావణ్‌కుమార్, దయానంద్ యాదవ్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

హుక్కా పార్లర్‌పై పోలీసుల దాడి

ఐదుగురిపై కేసు నమోదు

హిమాయత్‌నగర్: నాన్ హెర్బల్ ఉత్పత్తులతో హుక్కా వ్యాపారం చేస్తున్న ఓ హుక్కా పార్లర్‌పై నారాయణగూడ పోలీసులు ఇటీవల దాడి చేశారు. ఐదుగురిపై కోట్పా యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టోలిచౌక్‌కు చెందిన సర్ఫరాజ్ పార్లర్ యజమాని లేఖరాజ్ ఆదేశాల మేరకు నాన్ హెర్బల్ ఫ్లేవర్స్‌తో హుక్కా వ్యాపారం చేస్తున్నాడు. దీంతో సర్ఫరాజ్, దీపక్‌శర్మ, పుష్కర్‌శర్మ, షేక్ సయ్యద్‌తో పాటు పార్లర్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో అలెక్స్ గ్రేప్ ఫ్లేవర్స్ 4, డబుల్ యాపిల్ ఫ్లేవర్స్ 10, అలెక్స్ మొలాసిస్ ఫ్లేవర్స్ 5, ఆరెంజ్, కివీ, బ్లూబెర్రీ, కెహ్వేల్ 19, రూ.8,200 నగదు సీజ్ చేశారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబురాలు

'భారతీయ విద్యాభవన్'లో..



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో బుధవారం సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటాయి. డూడూ బసవన్నలు... హరిదాసులు.. ముత్యాల ముగ్గులు.. పతంగులు.. భోగి మంటలు.. ఇలా సంక్రాంతిని కళ్లముందుకు తెచ్చే అనేక కార్యక్రమాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణమంతా పల్లెటూరిని తలపించింది. సంక్రాంతి నేపథ్య వేషధారణలో విద్యార్థులు కను విందు చేశారు. ఆట, పాటలతో కట్టిపడేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయి సరస్వతి విద్యానికేతన్‌లో..



వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ముగ్గులు వేసి బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. స్కూల్ వ్యవస్థాపకులు శిరీష భవానీశంకర్, అకడమిక్ డైరెక్టర్ జయంతి వెంకటరామన్, హెచ్ఎం ఉషా మీనాక్షి పాల్గొన్నారు.

శ్రీనిధి కలాం క్యాంపస్‌లో



మధురానగర్‌లోని శ్రీనిధి కలాం క్యాంపస్‌లో సంక్రాంతి సంబురాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరెద్దుల విన్యాసాలు, రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. చిన్నారుల నెత్తిమీద బోగిపండ్లు పోసి టీచర్లు ఆశీర్వదించారు. స్కూల్ డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్ విమల తదితరులు పాల్గొన్నారు.

రాక్స్ టౌన్ హైస్కూల్లో..

రహమత్‌నగర్: బోరబండ స్వరాజ్‌నగర్ రాక్స్‌టౌన్ హైస్కూల్లో బుధవారం సంకాంత్రి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు స్కూల్ కరస్పాండెంట్ విజయ్‌కుమార్, హెచ్ఎం పకీయావతి, దేవమణి, లక్ష్మీదేవి, అబ్దుల్ మోయిజ్ బహుమతులు అందించి అభినందించారు.



దీన్‌దయాల్‌నగర్‌లో ముగ్గుల పోటీలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్ నగర్ బస్తీలో డివిజన్ బీజేపీ మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తిలకించి స్థానికులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



శ్రీగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ గాయత్రిహిల్స్‌లో శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గులను తిలకించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన సోనూ లతకు మొదటి బహుమతిగా రూ. 10 వేలు, ఉషకు రెండో బహుమతిగా రూ.5 వేలు, వాణికి రూ. 3 వేలు మూడో బహుమతి కింద అందజేశారు. గాయత్రిహిల్స్ అధ్యక్షుడు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వినతి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ఉన్న దాదాపు 5 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో కూనంనేని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఐదు లక్షల బాధితుల డిపాజిట్స్ రూ.500కోట్లు ఉంటే.. అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తుల విలువ సుమారు రూ.1500 కోట్లు ఉందన్నారు. ప్రభుత్వం అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను జప్తు చేసి బాధితులందరికీ డబ్బు చెల్లించాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాల మల్లేష్, అధ్యక్షుడు గోగుల వెంకటేశ్వరరావు, కోశాధికారి మద్దినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మందుబాబులకు జైలు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డ ఐదుగురు వాహనదారులకు కోర్టు జైలు శిక్ష విధించింది. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గత నెల, ఈ నెలలో చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17 మంది పట్టుబడ్డారు. పోలీసులు వీరిని బుధవారం నాల్గవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. ఇందిరానగర్‌కు చెందిన ఎన్.రాములు మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడటంతో ఆయనకు రూ. 3300 జరిమానా, 8 రోజుల జైలు శిక్ష న్యాయమూర్తి విధించారు. వెంకటగిరికి చెందిన ఎం. నర్సింహకు ఐదు రోజుల జైలు, పార్శిగుట్టకు చెందిన ఎస్. శివకుమార్‌కు, దమ్మాయిగూడకు చెందిన ఆర్. అబ్రహంకు, కూకట్‌పల్లికి చెందిన టి. సాయి కుమార్‌కు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష వేశారు. మిగతా 12 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. మొత్తం రూ. 36,900 జరిమానా రూపంలో వసూలైంది.